# కొడుకూ - కోమలీ

కొండ పైకి వెళ్ళే బస్సెక్కి కూర్చోగానే, కళ్ళలో మెదిలేది గోవిందుడే! మొట్ట మొదటి సంపాదన దిన జీతం పన్నెండు రూపాయలు చేతిలో పడగానే, గుండె చాటున తచ్చాడే కోమలి గుడిసె తలుపు తెరిచి చిరునవ్వుల మరుమల్లెలు పరిచి స్వాగతం చెబుతున్నట్లున్న ఊహా చిత్రం తప్ప మరేదీ పొడగట్ట లేదు, హనుమంతు కళ్ళకు.

నరుడి కోరికతీర్చే పాతాళ భైరవిని పదిలపరచుకున్నట్లుగా పన్నెండు రూపాయల్ని పంట్లాం వెనుక జేబులో దోపుకుంటూ, గేటు దాటి రోడ్డుమీది కొచ్చాడు హనుమంతు. పిచ్చెక్కిన గుర్రాల గుంపులా పరుగులు తీస్తోంది రోడ్డు. మైలున్నర దూరం లోనే ఉంది గూడెం. ఏం చెయ్యాలో తోచని హనుమంతుకు మాత్రం రోడ్డు మీద కాళ్ళు సాగలేదు.

'ఏయ్ ! ఏంటిదీ! వొదులూ!,'... పది రోజుల క్రితం గుడిసెలో దూరి తాను కోమలిని వాటేసుకున్నప్పుడు ఆమె అనిన ఆ మాట గుర్తుకొచ్చి, అతడి నరాలు జివ్వు మన్నాయి. ఆ మెత్తదనాలన్నీ మళ్ళీ ఒంటిమీద పారాడినట్లు అనిపించి పులకించి పోయాడతను.

ఇరానీ హోటల్లో టీ తాగి, సిగరెట్లు రెండు కొనుక్కొని గుప్పు గుప్పున పొగవదుల్తూ సినిమాకు బయలుదేరాడు. సినిమా బాగుంది. అందులో రేప్ సీను బావుంది. హీరో హీరోయిన్ల శృంగారం బావుంది. హీరోయిన్ అందచందాలు బావున్నాయి. ఆమె హీరో కౌగిట్లో ఒదిగిపోయినప్పుడల్లా హనుమంతు కుర్ర వయసు బావురుమంటూ ఏడవసాగింది. ఆ కౌగిలి తనదైతే ఎంత బాగుంటుంది ! అందరాని చందమామ ఆ హీరోయిన్! కౌగిట్లో ఇముడ్చుకుంటే కోమలి చాలు గదా, హీరోయిన్ వంపుసొంపుల్నీ, ముద్దు మురిపాలనీ తలపింపజేయటానికి.

కోమలికి పెళ్ళయింది. పెళ్ళయిన రెండేళ్ళకే పసుపు కుంకం చెరిగిపోగా, పుట్టింటికి తిరిగొచ్చి, ఏకాకిగా ఉంటున్న ముసలి తండ్రికి తోడుగా ఉంటోంది. గూడెంలోని కోడెకారు చిన్నవాండ్రు కొందరు కోమలి సందిట్లో వయసు పొంగుల వేడి నురగల మీగడ తరగల్ని రుచి చూశారన్న గుసగుసలు గొంతెత్తి చెవిలో కుయ్యిలిడకుండా ఉండి ఉంటే, హనుమంతు ఆ రోజు ఆమెను అలా వాటేసుకుని ఉండేవాడు కాదు. అంత ధైర్యం చేసినా, వేడి నురగల రుచి తన నోటికి అందనే లేదు. ఆమె తనను విదిలించి పారేసి, పైట సవరించుకుని, "కడుపు కూటికేడిస్తే, కొప్పు పూలకేడ్చిందంట! రూపాయి సంపాయించే బగిసి లేనోడికూ్కాడా ఆడది గావాల! ఓయబ్బో, మొకం జూడు, నేనేం బండమింద రోలనుకుంటివా, తేరగా దంచుకుపోవటానికి? పో! " అంటూ ఈసడించింది.

జేబులో డబ్బులున్నాయి, ఇప్పుడేమంటుందో కోమలి ?... ఏమంటుంది? 'శుభం ' అంటూ శకునం పలికింది వెండి తెర.

హనుమంతు ఇరానీ హోటల్‌లో చికెన్ బిరియానీ తిని బిల్లు చెల్లించి, మిగిలిన డబ్బు లెక్క పెట్టుకున్నాడు. ఆరు రూపాయలున్నాయి. పరవాలేదు కోమలి ఈసడించుకోదు. పగబట్టి ముసురుకుంటున్న వెన్నెల వేడిని సిగరెట్టు దమ్ములతో తడిపేసుకుంటూ గూడెం చేరుకున్నాడతను.

ముక్కుతూ, మూలుగుతూ గుడిసె బయట అరుగు మీద కడుపులో కాళ్ళు ముడుచుకుని పడుకున్న మునెయ్య కళ్ళల్లో చుక్కలు మొలిచాయి. "అబ్బోడొచ్చే సినాడే లచ్చివీ... ఇంత రేతిరిదాకా ఏంజేస్తా ఉంటివిరా నాయినా, తొందరగా ఇంటికి రాకుండా? "

"టౌన్‌లో ఉంటి.... " హనుమంతు కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి వెళ్ళాడు. పంట్లామూ చొక్కా విప్పి గోడకు తగిలించాడు. నాలుగు మూరల పంచె కట్టుకుని, సిరిచాప పరుచుకున్నాడు.

" అదేందిరా ! తినకుండా పండుకుంటావా? నాలుగు గంజిమెతుకు లుండాయి రా!" అంది లచ్చిమి.

" వొద్దులేయే ! నిద్దరొస్తావుంది నాకు. మీరు తాగెయ్యండి." కళ్ళు మూసుకుని బోర్లపడుకున్నాడు హనుమంతు. తాను వద్దన్న గంజి అమ్మా అయ్యా తాగారో లేదో అతడు గమనించలేదు. లచ్చిమి దీపం ఆర్పేసి పడుకుంది.

అరగంట గడిచాక, హనుమంతు పైకిలేచి వాకిట్లోకి వచ్చాడు. వెన్నెల గంగ వెర్రులెత్తినట్లు గంతులు వేస్తోంది. చందమామ కప్పుకున్న మేలి ముసుగులా

ఇరవై బారల దూరంలో కోమలి గుడిసె కనిపిస్తోంది. వెన్నెల్లో వేగిపోతూ విసవిసా నడిచాడు హనుమంతు. గుడిసె బయట గంగిరేణి చెట్టు కింద నులక మంచంలో ఒదిగిపోయి గురక తీస్తున్నాడు, కోమలి తండ్రి రాజయ్య. హనుమంతు మెల్లగా గుడిసె తలుపు తట్టాడు.

తెరుచుకున్న తలుపు సందులో నుంచీ మైనపు ముద్దలా కరిగి మాయమై పోయాడు.

ఇదంతా చూస్తూనే ఉన్నాడు మునెయ్య.

కోమలి గుడిసెలోంచి బయటపడి, కొడుకు ఇంట్లోకి రావటాన్ని చూడవలసి వస్తుంది కదా అన్న సిగ్గుతో మూసిన కన్ను తెరవలేదు మునెయ్య.

తెల్లవారింది.

పెదవి విప్పటానికి ఓపికలేనట్లు, నిలబడటానికి తీరికలేనట్లూ, కాళ్ళకు చక్రా లు తొడుక్కున్న వాడిలా తొందర తొందరగా టౌనుకు వెళ్ళి పోయాడు హనుమంతు.

లచ్చిమి కూలికి వెళ్ళింది. ఒంట్లో శక్తి ఉడిగిపోయి, పనీ పాటా చేసుకోలేని స్థితికి వచ్చిన మునెయ్య ఇంట్లోనే కూర్చున్నాడు.

పొద్దు గూట్లో పడేదాకా లచ్చిమి తిరిగిరాదు. క్రితం రోజు నాయుడుగారు ఆమెకు కూలిడబ్బులు ఇవ్వనేలేదు. పాత బాకీ కింద చెల్లువేసుకున్నాడు. అందుచేత, కాలే కడుపును నిన్న గంజి నీళ్ళతో చల్లార్చుకోవలసి వచ్చింది. పాపం, పరగడుపుతోనే పనికి వెళ్ళింది లచ్చిమి.

మధ్యాహ్నం కాగానే మునెయ్య కడుపులో ఆకలి అగ్గిగా మారింది. మంచి నీళ్ళు ముంచి తాగుతుంటే, రాజయ్య ఇంటి వాకిట్లో నుంచి కోమలి కేకవేసి పిలవటం వినిపించింది. " మావోఁ" ఓ మునెయ్యమావోఁ".

" ఏవేఁ ? " అంటూ బయటికి తొంగిచూశాడు మునెయ్య.

" ఇట్రా ! అయ్య రమ్మంటాఉండాడు. "

తలుపు గొళ్ళెం పెట్టి ఆ ఇంటికి వెళ్ళాడు మునెయ్య.

" ఏందిరా రాజిగా ? "

" కూర్చో!... అయిపోయిందంటే కోమలా ? "

" ఇదో ! ఇంకొక్క నిమషం. "

" కానీ మరి!...నీకొడుక్కేందో ఉద్యోగ మొచ్చిందంట గదరా మునెయ్యా?"

" ఆ? పదోతరగతి పరీక్ష తప్పి నోడికి ఏముద్యోగమొస్తుందిలే?.. సదువుకు సున్నజుట్టి ఐదారేండ్లు బసవెద్దు మాదిరిగా తిరిగి నాడు. ఇప్పుడదేందో చిన్న నౌకరీ ఏసినారు. ఏ పొద్దు జీతం ఆ పొద్దే ఇచ్చేస్తారంట? నిన్నట్నుంచీ మొదులు! అదయినా, ఖాయంగాదు. రెండు మూణ్ణెల్లుంటే జాస్తి. "

మాటల మధ్యలోనే, అన్నంలో వేడి వేడిగా కూరపోసి రెండు కంచాలు తెచ్చి వాళ్ళ ముందర పెట్టింది కోమలి.

" తినరా మునెయ్యా !... పావుకిలో మాంసం దెచ్చి కూరజేసింది. ఉడికింది గదా, పెట్టమ్మీ అంటే, మావఁ రానీ మావఁ రానీ అని ఒకటే పాట! "

నోట్లో వూరుతున్న నీటిని గుటకవేస్తూ, పొగలు కుక్కుతున్న కూరలో చెయ్యి పెట్టాడు మునెయ్య.

" ఏమంటివీ? పరిమినెంటుద్యోగం కాదంటావా ? ఏదో ఒకటి ? మంచికాలం రాకుండానే పోతుందా ? చెట్టంత కొడుకు – సాకిసంతరించేస్తాడు. నాకూ ఒక కొడుకు లేకపోయె, ఈ తిప్పలుండేవి కావు మాకు? "

మునెయ్య నోట్లో నీళ్ళూరటం ఆగిపోయింది. ముద్ద నోటికి వెళ్ళలేదు. " ఏమీ అనుకోబాకరా రాజయ్యా ! ఒళ్ళు అదోక మాదిరిగా ఉంది. నేను తిన్లేను." అంటూ పైకి లేచాడు. చరచరా బయటకు వచ్చేశాడు.

అతడి వెనకే గుమ్మందాటి వచ్చిన కోమలి " ఏం మావాఁ? నా చేతి కూడు తినగూడదా?" అని అడిగి, టక్కున తలవంచుకుంది.

"ఛా, అదేం మాటే? నీ చేతికూడు తినాలంటే అడిగిరావాల ? అదురుష్ట మంటే మీ అయ్యదేనే? నా కొడుకు నాకు బెట్టాల్సిన కూడే అది. దాన్ని నువ్వు పెడ్తే తొనాల్సిచ్చింది గదా అని సిగ్గుగా ఉంది. ఒసే కోమలా ! నువ్వు ఆడపిల్లయితే మాత్రం ఏవేఁ? బుద్దిమంతురాలివి ! తప్పో ఒప్పో, నీకు చేతనైన పన్జేసి, ఏ దిక్కూలేని తండ్రికి పట్టెడు కూడు బెడతా ఉండావు. నీ అయ్యకు నువ్వు కూతురివి గావు. కొడుకువి ! దయ అనేది లేకపోతే కొడుకెందుకే, నీ బోటి కూతురు మేలు" అంటూ ఆమె తల నిమిరి, చెమర్చే కళ్ళతో గుడిసెవైపు నడిచాడు మునెయ్య. ■

• భారతి ఆగస్టు 1983 •